రేపు జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: నిరుద్యోగ యువతీయువకులకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధికా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివిన 18 నుంచి30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 77299 92061, 92462 60743, 73868 09422, 98664 65024 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎస్ఐఆర్ స్టార్టప్ కాంక్లేవ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఐఐసీటీ జహీర్ మెమోరియల్ పాఠశాలలో రెండ్రోజుల స్టార్టప్ కాంక్లేవ్ నిర్వహించనున్నట్లు సీఎస్ఐఆర్-ఐఐసీటీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు పారిశ్రామిక వ్యవస్థను అనుసంధానం చేసేలా జరిగే ఈ సదస్సును కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఆవిష్కరిస్తారని తెలిపారు. మంగళవారం ప్రారంభోత్సవంతో పాటు, స్టార్టప్‌ల ప్రదర్శన, ఆవిష్కర్తలతో చర్చాగోష్ఠి ఉంటుందని.. రెండో రోజు టెక్నికల్ సెషన్ ఉంటుందని.. నేటి ఆధునిక సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లను అధిగమించడంలో పారిశ్రామిక అవకాశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు.

డీపీఆర్ ఇంకెప్పుడు ?

నార్త్ సిటీ డీపీఆర్ జాప్యంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆగ్రహం

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో కీలకమైన డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూపొందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ యేడాది మార్చి 31లోపు ప్రభుత్వానికి డీపీఆర్ అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా.. ఇప్పటికీ రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని మెట్రో రైలు సంస్థ వెల్లడించడంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే డీపీఆర్‌ను రూపొందించి కేంద్రానికి అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నార్త్ సిటీ ప్రజలకు కొత్త ఏడాది కానుకగా మెట్రో నిర్మాణంపై సీఎం ప్రకటన చేశారు. మార్చి 31లోపు డీపీఆర్ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అయితే గడిచిన 100రోజులుగా ఇచ్చిన హామీకి ఎలాంటి రూపం లేకుండాపోయిందన్నారు. డీపీఆర్ తయారీకి నెలల కొద్దీ సమయం తీసుకుంటే... ఇక నిర్మాణ పనులకు ఎంత సమయం తీసుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే నార్త్ సిటీ డీపీఆర్ సిద్ధం చేయడంతో పాటు త్వరగా మెట్రో నిర్మాణ పనులు పూర్తి చేయాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్ చేసింది. ఇంకా జాప్యం చేస్తే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ నేరుగా అర్జీలను స్వీకరించారు. కాగా ప్రధాన కార్యాలయంలో ప్రజావాణికి 82 అర్జీలు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 111 అర్జీలను స్వీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్,చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరిరావు, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- మీర్‌పేట మున్సిపల్ అధికారులతో సమీక్ష

మున్సిపల్ అధికారితో మాట్లాడుతున్న సబితారెడ్డి

బడంగ్‌పేట్,ఏప్రిల్ 21: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మీర్‌పేట్ మున్సిపల్ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. గుంతలమయంగా మారిన ప్రధాన, కాలనీల రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. మున్సిపాటిలీ పరిధిలోని మూడు చెరువుల చుట్టూ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయిందని.. గత బీఆర్ఎస్ హయాంలో చెరువులలో గుర్రపు డెక్కను ఎప్పటికప్పుడు తొలగించేవారమని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ చెరువుల పూడికతీతను పట్టించుకోకపోవడం వల్లనే అవి అధ్వానంగా తయారవుతున్నాయని సబితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చందన చెరువు వద్ద అవసరమైన చోట నూతన టాయిలెట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలాపూర్ చౌరస్తా వద్ద ఉన్న లేబర్ అడ్డాను, స్ట్రీట్ వెండర్స్ షెడ్ వద్దకు తరలించాలని ఆదేశించారు. రైతు బజార్ పక్కన ఉన్న స్ట్రీట్ వెండర్ షెడ్‌ను ఆక్షన్ ద్వారా లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పన్నారు. సమీక్ష సమావేశంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కదనోత్సాహంతో కదులుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమైతదని ప్రజలంతా కేసీఆర్‌కు అండగా నిలిచారు. తెలంగాణ వచ్చుడో-కేసీఆర్ చచ్చుడో అని 2009 సంవత్సరంలో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ముఖ్యమంత్రిగా రోశయ్య పని చేస్తున్న సమయంలో కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించడం, అక్కడి నుంచి నిమ్స్ దవాఖానకు కేసీఆర్‌ను తరలించారు. మొక్కవోని దీక్షతో కేసీఆర్ దవాఖానలోనే దీక్షను కొనసాగించారు. ఎంపీగా ఉన్న కేసీఆర్ ప్రాణాలను లెక్క చేయకుండా అమరణ నిరాహార దీక్షను కొనసాగించడం, చనిపోయే స్టేజిలో ఉన్నారని గుర్తించిన యూపీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో చిదంబరంతో ప్రకటన చేయించారు. అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమం చేసిన ఫలితంగా సోనియాగాంధీ దిగొచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారమైనది. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చరిత్రను ఎవ్వరూ చెరపలేరు.

అనతి కాలంలో అభివృద్ధి వైపు..

ఉద్యమ నాయకుడే తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాలు అన్నింటికంటే మించి శాంతిభద్రతల సమస్య లేదని కితాబు ఇచ్చిన పరిస్థితి. దేశంలోనే నంబరు వన్ గ్రోత్ రేట్ ఉన్న రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దారు.

కరెంట్, సంక్షేమ పథకాలు లేక అల్లాడిపోయిన రాష్ట్రాన్ని అనతికాలంలోనే అభివృద్ధి, సంక్షేమంలో ప్రగతిపథం వైపు నడిపించారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్లిన వారంతా స్వంత రాష్ట్రానికి తిరిగి వచ్చేలా చేశారు. వలసలు ఆగడమే కాదు ఇతరులను తెలంగాణ రాష్ట్రానికి ఉపాధి బాట పట్టించారు. ఇందుకు కరోనా లెక్కలే నిదర్శనం. దాదాపు 25 లక్షల మంది హైదరాబాద్‌కి వలస వచ్చి తెలంగాణలో పనిచేసే పరిస్థితులు కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. మినీ ఇండియా హైదరాబాద్‌లో కేసీఆర్ పాలన అద్భుతంగా ఉందని, కరెంట్, నీళ్లకు అన్నింటికంటే మించి శాంతిభద్రతల సమస్య లేదని కితాబు ఇచ్చిన పరిస్థితి. దేశంలోనే నంబరు వన్ గ్రోత్ రేట్ ఉన్న రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దారు.

ఉద్యమ పంథాలో తరలుదాం..

రజతోత్సవ సభ చారిత్రాత్మకమైనది. 14 ఏండ్ల ఉద్యమం తర్వాత 10 ఏండ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రంలో అద్భుత పాలన అందించారు.. తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా కేసీఆర్ నిలబెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంతో పాటు నేడు కూడా బహిరంగ సభలకు కేసీఆర్ పిలుపునిస్తే లక్షలాదిగా ప్రజలు తరలివస్తారు, అందుకే కేసీఆర్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసమే కారణం. ఈ సభకు పార్టీ ప్రజాప్రతినిధులు , కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చేలా రూపకల్పన చేశాం. ఉద్యమ స్ఫూర్తిని ఎలా చాటారో అదే పంథాలో సభకు తరలివెళతాం. ప్రతి నియోజకవర్గం నుంచి 4 వేల మంది వస్తారు.. ఎక్కడికక్కడ జెండాను ఎగరవేసి వరంగల్ సభకు తరలివెళ్తాం. దేశ రాజకీయాల్లో ఈ సమావేశం చరిత్రగా నిలువనున్నది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పని అయిపోయిందని అన్న వాళ్లకు కూడా ఈ సభ సమాధానం చెబుతుంది. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తాం. పార్టీ శ్రేణులే కాదు ప్రజలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు ,కర్షకులు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు.

ఇసుక క్వారీలను కార్పొరేట్‌కు కట్టబెట్టే యత్నం

- ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ



ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

ముషీరాబాద్, ఏప్రిల్ 21: షెడ్యూల్ ఏరియాలోని ఇసుక క్వారీలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స్ నర్సింహ ఆరోపించారు. సోమవారం ఆదివాసి నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఏజెన్సీ ప్రాంతం ఆదివాసీ ఇసుక పరస్పర సహకార సంఘాలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు కోర్స్ నర్సింహ, ఓయూ జేఏసీ చైర్మన్ గద్దె వెంకట్, ఎమ్మార్పీఎస్ జాతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ. . తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గోదావరి నదిలోని ఇసుకను కారు చౌకగా ప్రభుత్వం కాజేస్తుందన్నారు. ప్రభుత్వం తేనున్న నూతన ఇసుక పాలసీ షెడ్యూల్ చట్టాలు.. ఎల్ టి ఆర్సే, సా చట్టాలను కాలరాసి ఆదివాసులకు అన్యాయం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైండ్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అండ్ డెవలప్మెంట్ చట్టంలోని సెక్షన్ 11 (5) ప్రకారం ఐదో షెడ్యూల్ ఏరియాలో ప్రభుత్వం లేదా ఇతర వ్యక్తులు మైనింగ్ చేసే అధికారం లేదని చెబుతుందన్నారు. షెడ్యూల్ ఏరియాలో గిరిజన సహకార సంఘాలకు మాత్రమే మైనింగ్ చేసే అధికారం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ నండూరి నర్సింహ, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు డప్పు రమేష్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, ఆదివాసి అడ్వకేట్ రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన పాపారావు, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు వాట్టం సుభద్ర, ఇసుక సొసైటీ ములుగు జిల్లా అధ్యక్షులు రామలక్ష్మి, రజిని కుమారి పద్మ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌రాజ్ కాటన్ టవల్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా మీనాక్షి చౌదరి

సిటీ బ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రామ్‌రాజ్ కాటన్ నూతనంగా ప్రవేశపెట్టిన మృదు టవల్స్‌కు ప్రముఖ సినీతార మీనాక్షి చౌదరిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఈమేరకు రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అరుణ్ ఈశ్వర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృదు టవల్స్ కలెక్షన్ ఆధునిక జీవన శైలికి అనుగుణంగా, ఆలోచనాత్మకంగా రూపొందించినదని పేర్కొన్నారు. మృదు టవల్స్‌లో అసాధారణమైన, నాణ్యమైన డిజైన్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

దేశాన్ని ఆ రెండే శాసిస్తున్నాయి

ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కాచిగూడ, ఏప్రిల్ 21: దేశాన్ని శాసించేది రెండేనని.. ఒకటి రాజ్యాధికారం, రెండోది డబ్బు అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, చైర్మన్ జయంతి గౌడ్ ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ హోటల్లోసోమవారం నేషనల్ బీసీ మహిళా జాక్ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎంపీ హనుమంతరావు పాల్గొన్నారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రపంచంలో అనేక సూచికల్లో ఇండియా అట్టడుగు స్థాయిలో ఉందని, అందుకు కారణం కొన్ని రాజకీయ పార్టీల కుట్రే అని అన్నారు. దేశంలో ఉండేటువంటి మెజార్టీ ప్రజలు చైతన్యవంతులు కాకూడదని, ఒకవేళ వారు చైతన్యవంతులైతే రాజ్యాధికారం చేజిక్కించుకుంటారనే అక్కసుతో పలు రాజకీయ పార్టీ కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రజా చైతన్యంతోనే ఇలాంటి కుట్రలకు చెక్ పెట్టవచ్చన్నారు. నాయకులు.. గుజ్జ కృష్ణ, లక్ష్మణ్ యాదవ్, కోలా జనార్ధన్, నందగోపాల్, ఉదయ్ నేత, నరేందర్ గౌడ్, శ్రీనివాస్, సుజాత మంజు, సరోజ శివమ్మ, విజయ్ రాఘవేంద్ర, బీసీ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందుతున్నాయా?

- గగన్‌మహల్ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- గర్భిణులు, రోగులతో వసతులపై ఆరా

వైద్య సేవలపై రోగులను ఆరా తీస్తున్న కలెక్టర్ అనుదీప్

సిటీ బ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): దోమలగూడ గగన్ మహల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. లేబరేటరీని సందర్శించి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారా? అని ఆరా తీశారు. ప్రసవగది, ఐపీ వార్డు, స్కానింగ్ రూమ్‌ను పరిశీలించి అనవసర వస్తువులను తొలగించి గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయమాలిని, డాక్టర్ రాజ్య లక్ష్మి, తహసీల్దార్ సంధ్యారాణి, వైద్యులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సీఎం ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 99 దరఖాస్తులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, ముకుంద రెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, అధికారులు పవన్ కుమార్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

టాబ్లెట్లకు గ్లూకోజ్ కలిపి..

(మొదటి పేజీ తరువాయి)

డోస్‌లు వారికి పనిచేయకపోవడంతోనే డోస్ పెంచి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఒకేసారి టాబ్లెట్లు వాడకుండా, సాహిల్ వాటిని గ్లూకోజ్ వాటర్‌లో కలిపి లిక్విడ్‌గా తయారు చేసి, దానిని యువకులకు ఇంజక్ట్ చేశాడని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. గ్లూకోజ్, ట్యాబ్‌లెట్లు ఎక్కువ మోతాదులో కలువడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఎంత మంది వాడారో..?

ఇంటర్, డిగ్రీ చదువుతున్న యువకులతో పాటు ఖాళీగా జులాయిగా తిరిగే వాళ్ల సంఖ్య శివారు ప్రాంతాలలో ఎక్కువగానే ఉంటుంది. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అయితే బాధిత యువకులు ముగ్గురే ఈ అలావాట్లు చేసుకున్నారా మరి సాహిల్ నెట్‌వర్క్‌లో ఇంకెంత మంది ఉన్నారు. ఎన్ని రోజుల నుంచి సాహిల్ ఇలా టాబ్లెట్లను విక్రయిస్తున్నాడు? అనే విషయాలపై పోలీసులు ఇప్పుడు ఆరా తీస్తున్నారు. సాహిల్ నెట్‌వర్క్ గూర్చి తెలిస్తే ఈ ఘటనలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ ఘటనపై రాచకొండ పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మెడికల్ దుకాణాలు, అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): లేఔట్లతో పాటు నివాసప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే సహించేది లేదని, రహదారులకు ఆటంకాలు సృష్టించవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 52 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

జలమండలి పర్సనల్ డైరెక్టర్‌గా అబ్దుల్ ఖాదర్

అబ్దుల్ ఖాదర్‌ను సన్మానించిన టీజీఓ అసోసియేషన్ సభ్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్21,(నమస్తే తెలంగాణ): జలమండలి పర్సనల్ డైరెక్టర్‌గా మహ్మద్ అబ్దుల్ ఖాదర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీజీఎం(పీ అండ్ ఏ)గా పనిచేస్తున్న ఆయన డైరెక్టర్ (పర్సనల్)గా పదోన్నతి పొందారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీఓ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ ఖాదర్‌ను ఘనంగా సన్మానించారు.

గోధుమకుంట కబ్జా!

మట్టితో పూడ్చిన గోధుమకుంట. (ఇన్‌సెట్‌లో) లారీతో మట్టి డంప్ చేస్తున్న దృశ్యం

నాగారం మున్సిపాలిటీ గోధుమకుంట గ్రామ పరధిలోని సర్వే నంబర్ 38లో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోధుమకుంట(చెరువు)ను కొందరు అక్రమార్కులు గట్టుచప్పుడు కాకుండా కబ్జాకు యత్నిస్తున్నారు. గతంలోనే కుంట కట్టను పూర్తిగా తొలగించగా తాజాగా లారీలలో మట్టిని తెచ్చి కుంటను పూడ్చేస్తున్నారు. విషయం గ్రామస్తులకు తెలవడంతో ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ మాట్లాడుతూ.. కుంట కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. – మేడ్చల్

ఎయిర్ క్రాఫ్ట్ రెస్క్యూ, ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ

ప్రారంభోత్సవ కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధులు, అతిథులు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విమానయాన శిక్షణ సంస్థ అయిన జీఎంఆర్ ఏరో అకాడమీ తన ఎయిర్ క్రాఫ్ట్ రెస్క్యూ, ఫైర్ ఫైటింగ్ శిక్షణ ప్రోగ్రామ్‌ను హైదరాబాద్ క్యాంపస్‌లో పునఃప్రారంభించినట్లు ప్రకటించింది. 2013 నుంచి 2018 మధ్యకాలంలో 350 మందికిపైగా సిబ్బందికి శిక్షణను అందించిన జీఎంఆర్ సంస్థ శిక్షణను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా 9వ బ్యాచ్ మే 14న ప్రారంభం కానున్నట్లు జీఎంఆర్ ఏరో అకాడమీ అధ్యక్షుడు అశోక్ గోపినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 వారాల పాటు సాగే ఈ సమగ్ర కోర్సు ఐసీఏవో ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. ఇందులో ఆధునిక ఫైర్‌ఫైటింగ్ పరికరాలతో ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమలో అనుభవం ఉన్న అధ్యాపకుల బోధన ఉంటుందని తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు, జీఎంఆర్ఏఏ నిర్వహిస్తున్న 15కు పైగా భారతీయ విమానాశ్రయాలు, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి ప్రముఖ ఎయిర్‌లైన్స్‌తో ఉన్న భాగస్వామ్యాల ప్రయోజనాలను పొందగలుగుతారని చెప్పారు. ఇప్పటివరకు 980 మందికి పైగా శిక్షణ పొందినవారిని భారతదేశవ్యాప్తంగా వివిధ విమానాశ్రయాల్లో ఉద్యోగాలకు పంపగలిగామని వెల్లడించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్, ఏప్రిల్ 21: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సు కు మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో ఉపేందర్, ఇన్ చార్జి తాహసీల్దార్ సునీల్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నాయకులు సుధీర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

మేడ్చెల్ జిల్లాలో సోమవారం నిర్వహించిన భూభారతి అవగాహన కార్యక్రమానికి హాజరైన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడికి మేడ్చెల్ జిల్లా ట్రెసా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రామక్రిష్ణారెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. భాభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖరులు

స్లాట్ బుకింగ్‌ను రద్దు చేయాలి

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ మేడ్చల్ దస్తావేజు లేఖరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం మేడ్చల్‌కు వచ్చిన మంత్రికి వినతిపత్రం ఇచ్చిన దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ..స్లాట్ బుకింగ్ కారణంగా తాము రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. తమ సమస్యను సీఎంకు వివరించాలని మంత్రిని కోరారు.

మానవీయ విలువలు నేర్పించాలి: శాంతారావు

చిక్కడపల్లి, ఏప్రిల్ 21: మనుషులున్న ప్రతి చోట చలివేంద్రాలు వెలిసినట్లుగా .. పిల్లలున్న ప్రతి చోట "సమ్మర్ క్యాంప్" లు నిర్వహించాలని బాలోత్సవం రాష్ట్ర కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేసవి సెలవుల్లో రాష్ట్ర సమ్మర్ క్యాంప్‌ల వర్క్‌షాప్ నిర్వహించారు. 12 జిల్లాల నుంచి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బాలల యాక్టివిస్టు కే శాంతారావు మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంప్‌లలో పిల్లలకు విజ్ఞాన, వినోద, మానవీయ విలువలు నేర్పాలన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సోమయ్య, బుచ్చిరెడ్డి, వివిధ జిల్లాల కమిటీ సభ్యులు నాగకృష్ణ, మారన్న, రాధిక, వెంకటేశ్, శ్రీమన్నారాయణ, గోవర్ధన్, గురుమూర్తి, వెంకటయ్య, చెన్నయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 21